క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలోకి జి.రాగంపేట సర్పంచ్



జి.రాగంపేట సర్పంచ్ శేఖర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సునీల్, దొరబాబు

పెద్దాపురం: మండలంలోని జి.రాగంపేట సర్పంచ్ బుంగా శేఖర్ తన వర్గానికి చెందిన టీడీపీ, జనసేన కార్యకర్తలు సుమారు వంద మందితో మంగళవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు సమక్షంలో వారు పార్టీలో చేరారు. ఏఎంసీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు, మాజీ జెడ్పీటీసీ బంగారు కృష్ణ, ఎంపీటీసీ కాలే అనురాధ ఆధ్వర్యంలో చేరిన వారు సీఎం జగన్ సంక్షేమాభివృద్ధి చూసి రానున్న ఎన్నికల్లో మళ్లీ ఆయనను గెలిపించాలని పార్టీలో చేరినట్టు శేఖర్ తెలిపారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో నాగబాబు ప్రతిభ

సామర్లకోట: పట్టణానికి చెందిన యాతం నాగబాబు మరో మైలు రాయి దాటారు. మాస్టరు అథ్లెటిక్ పోటీల్లో ఇప్పటికే 60 పతకాలు సాధించిన నాగబాబు ఈ నెల 13న సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ స్టేడియంలో జరిగిన నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ చాంపియన్‌షిప్ 2024లో పాల్గొన్నాడు. ఈ పోటీలో 800 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 400, 200 మీటర్ల పరుగు పందెం పోటీలో వెండి పతకాలు సాధించాడు. దాంతో ఇప్పటి వరకు 63 పతకాలు సాధించి మాస్టర్ అథ్లెటిక్స్‌లో రికార్డు సృష్టించాడు. ఈ మేరకు మంగళవారం 55 ఏళ్ల వయస్సులో పరుగు పందెంలో నాగబాబు చూపుతున్న ప్రతిభను మున్సిపల్ కమిషనర్ రామారావు అభినందించారు. నాగబాబు జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారిగా పని చేస్తున్నారు.

ప్రతి ఒక్కరం ఓటేద్దాం.. స్వీప్ లక్ష్యం సాధిద్దాం

దర్గా సెంటర్‌లో ఎంసీసీ ఆధ్వర్యంలో మానవహారం

పెద్దాపురం: భారత ఎన్నికల సంఘం (స్వీప్) లక్ష్య సాధనలో భాగంగా ప్రతి ఒక్కరం ఓటేద్దాం ... స్వీప్ లక్ష్యాన్ని సాధిద్దామంటూ పెద్దాపురం ఎంసీసీ కన్వీనర్, ఎంపీడీఓ జి.ఉషారాణి ఆధ్వర్యంలో మంగళవారం సిబ్బంది స్థానిక దర్గా సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఉషారాణి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో నూరు శాతం పోలింగ్ లక్ష్యంగా స్వీప్ పని చేస్తోందని, దీనికి ప్రతి ఓటరు సహకరించాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నూరు శాతం ఓటింగ్ జరపాలన్నదే స్వీప్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెలుగుల సురేష్, ఇన్‌చార్జి ఈఓ పీఆర్డీ నక్కా సత్యనారాయణ మూర్తి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

కొత్తపల్లి: వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని ఎంపీడీఓ వెంకట నారాయణ అన్నారు. స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ఓటు హక్కు వినియోగంపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని వసతులు, సౌకర్యాలు కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భాస్కరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న వసంత నవరాత్ర పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో 8 రోజులుగా జరుగుతున్న వసంత నవరాత్ర పూజలు బుధవారంతో ముగియనున్నాయి. ఉగాది పర్వదినం సందర్భంగా ప్రారంభమైన వసంత నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న మంగళవారం కూడా ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయానికి వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా సాయంత్రం స్వామి వారిని అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు.

21న వినాయక ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

సామర్లకోట: మండల పరిధిలోని పవర గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసిద్ధి వినాయక ఆలయంలో ఈ నెల 21న విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 19న ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని అంకురార్పణ, యాగశాల ప్రవేశం, మండప పూజ, క్షీరాధివాసం, సాయంత్రం హోమాలు, నీరాజన మంత్రపుష్పాలు ఉంటాయన్నారు. 20న మండప పూజలు, లక్ష్మీగణపతి హోమం, ధాన్యాధివాసం ఉంటాయని తెలిపారు. 21న విగ్రహ ప్రతిష్ఠ, గోదృష్టి తదితర కార్యక్రమాల అనంతరం మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

వేటకు లంగరు

- నిషేధంతో నిర్మానుష్యంగా మారిన తీరం
- బోట్లు ఒడ్డుకే పరిమితం
- వలలు అల్లుకోవడంలో నిమగ్నమైన మత్స్యకారులు
- 5,285 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ మత్స్యకార భరోసా



వలలు అల్లుకుంటున్న మత్స్యకారులు

కొత్తపల్లి: చేపల వేట నిషేధంతో తీర ప్రాంతం నిర్మానుష్యంగా మారింది. మండలంలోని మత్స్యకార గ్రామాల్లో సుమారు ఆరు వేల కుటుంబాలు, 1,264 బోట్లు ఉన్నాయి. ఇక్కడి మత్స్యకారులకు చేపల వేటే జీవనాధారం. ఉప్పాడ, సుబ్బంపేట, మాయాపట్నం, సూరాడపేట, అమీనాబాద్, పొన్నాడ, మూలపేట, కోనపాపపేట తదితర గ్రామాల్లో మత్స్యకార కుటుంబాలు చేపల వేట సాగిస్తుంటాయి. వలలు పట్టుకుని సముద్రంపైకి వెళ్లారంటే రోజులు, వారాల తరబడి ఇంటి ముఖం చూడని పరిస్థితి. సముద్రుడు కరుణిస్తే వందల కి.మీ. వెళతారు. వేట సాగించి మత్స్య సంపదతో ఇంటికి తిరిగొస్తారు. సముద్రంలో మత్స్య సంపద అభివృద్ధి చెందే సమయం కావడంతో ఏటా ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుంచి జూన్ 15 అర్ధరాత్రి వరకూ ప్రభుత్వం చేపల వేటను 61 రోజుల పాటు నిషేధించింది.

కట్టుదిట్టమైన నిఘా

ఈ సమయంలో ఎవరైనా వేటకు వెళితే కేసులు పెడతామని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. తీరం వెంట మత్స్యశాఖ, మెరైన్, నేవీ అధికారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా కట్టుదిట్టమైన నిఘా పెట్టారు. దీంతో ఎక్కడికక్కడ చేపల వేట నిలిచిపోయింది. గతంలో అక్కడక్కడా చేపల వేట కొనసాగించినా ఈ ఏడాది గట్టి భద్రతా చర్యలు తీసుకోవడంతో ఎక్కడా వేట జరుగుతున్న దాఖలాలు కనిపించడం లేదు. ప్రస్తుతం మత్స్యకారులు వలలను ఒడ్డుకు చేర్చుకుని మరమ్మతులు చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. చేపల విక్రయాలతో ఉప్పాడ తీర ప్రాంతం కళకళలాడుతుండేది. బోట్లు లంగర్లు వేయడంతో చిన్న తెప్పలపై మాత్రమే సముద్రంలో వేట సాగించడం కనిపిస్తోంది. నిత్యం చేపల ఎగుమతులతో కళకళలాడే ఉప్పాడ, అమీనాబాదు తీరప్రాంతం బోసిపోయింది.

వైఎస్సార్ మత్స్యకార భరోసాతో..

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారులకు వైఎస్సార్ మత్స్యకార భరోసాతో ఆర్థిక సహకారం కల్పించారు. నాలుగేళ్లుగా వేటకు వెళ్లే ప్రతి మత్స్యకారుడికి రూ.10 వేలు వారి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నారు.

వేట నిషేధంతో రామన్నపాలెం ఉప్పుటేరు వద్ద చేరిన బోట్లు



మత్స్యకార భరోసా లబ్ధిదారుల వివరాలు

సంవత్సరం	మత్స్యకారులు
2019–2020	4,426
2020–2021	4,611
2021–2022	5,327
2022–2023	5,285

గతంలో ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు



మత్స్యకారులను గతంలో ఏ ప్రభుత్వం కూడా పట్టించుకున్న దాఖలాలు లేవు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మత్స్యకార భరోసాతో మా కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటున్నారు.

– ఎం.శ్రీను, మత్స్యకారుడు, ఉప్పాడ

భరోసా ఇచ్చారు



ప్రభుత్వం అందించే మత్స్యకార భరోసాను ఇప్పటివరకూ వేట నిషేధ సమయంలోనే అందించారు. అవినీతికి తావు లేకుండా, మా బ్యాంకు ఖాతాల్లోకి సొమ్మును జమ చేశారు. ఈ ఏడాది కూడా త్వరితగతిన పరిహారాన్ని అందించాలి.

– ఎం.జగన్నాథం, మత్స్యకారుడు, ఉప్పాడ



మత్స్యకార భరోసాకు దరఖాస్తు తీసుకుంటున్న మత్స్య శాఖ అధికారి

రుణపడి ఉంటాం



మా కుటుంబం ఎప్పుడూ వైఎస్సార్ కుటుంబానికి రుణపడి ఉంటాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎంతో లబ్ధి చేకూరింది. నాకు 4 సార్లు వైఎస్సార్ మత్స్యకార భరోసా, నా భార్యకు డ్వాక్రా రుణమాఫీ, పిల్లలకు అమ్మఒడి పథకాలు లభించాయి. మత్స్యకారుల కుటుంబాలకు ఈ ప్రభుత్వంలో ఎంతో మేలు జరిగింది.

– మదదా జగన్నాథం, మత్స్యకారుడు, తొండంగి మండలం

నిబంధనలు పాటించాలి

వేట నిషేధ సమయంలో ఏ ఒక్క మత్స్యకారుడు చేపల వేటకు వెళ్లరాదు. సంప్రదాయ బోటులతో వేట సాగించుకోవచ్చు. వేట నిషేధంపై మత్స్యకారులకు అవగాహన కల్పించడంతో పాటు, మత్స్యకార గ్రామాల్లో ప్రచారం చేశాం. మత్స్యకార భరోసా పొందేందుకు వారి నుంచి అధికారులు దరఖాస్తులు సేకరిస్తున్నారు.

– శ్రీరామకృష్ణ, మత్స్య శాఖ అధికారి

సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు



సామర్లకోటలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి దవులూరి దొరబాబు ఇంటింట ప్రచారం

- ఎన్నికల ప్రచారంలో దవులూరి దొరబాబు
- 23, 25 వార్డుల్లో ఎన్నికల ప్రచారం

సామర్లకోట: సంక్షేమ పథకాలు పేదకు మేలు చేస్తున్నాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం స్థానిక 23, 25 వార్డుల్లో కౌన్సిలర్లు సేపెని సురేష్, గుబ్బల సత్యనారాయణ, కో ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావుల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను ప్రవేశ పెట్టి వాటిని అమలు చేశారని, ఆ పథకాలను ప్రజలు పూర్తి స్థాయి సద్వినియోగం చేసుకొవడంతో ఆ పథకాలను తిరిగి కొనసాగించాలని నిర్ణయించారని తెలిపారు. ఆర్థిక సమానత్వం సాధించడమే లక్ష్యంగా జగన్‌మోహన్ రెడ్డి పని చేస్తున్నారని చెప్పారు. చంద్రబాబునాయుడును ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. ప్రజలకు మేలు చేస్తున్న వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబునాయుడు అండ్ కో తప్పుడు ఆరోపణలు చేసి అవ్వాతాతలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్, గృహ సారథుల కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, పార్టీ సీనియర్ నాయకులు గంగిరెడ్డి కృష్ణమూర్తి, మనకపల్లి సత్యనారాయణ, చిట్టుమాని శ్రీనివాసరావు, మాగాపు గోపి, బీవీ రమణ, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజల ఆశీస్సులతో గెలుపు మాదే..

వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత



విరవాడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వంగా గీత తదితరులు

పిఠాపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదిస్తున్నారని పార్టీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. మండలంలోని విరవాడలో మంగళవారం ఎమ్మెల్యే పెండెం దొరబాబుతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు గట్టిగా కోరుకుంటున్నారని, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఓటు వేయడం ప్రజల పని, అభివృద్ధి చేయడం మా పని అంటూ ప్రచారం చేస్తుంటే వారి నుంచి అనూహ్య స్పందన కనిపిస్తోందన్నారు. ఈ సందర్భంగా జనం వంగా గీతకు బ్రహ్మరథం పట్టారు. సంక్షేమ పథకాలను ప్రజల ఇళ్లకే చేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూసి వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని వంగా గీత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఇప్పటి వరకు ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ప్రజలతో మమేకమైన ఆమె వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అందరికీ అందుబాటులో ఉండే తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని, వారి ఇంటి మనిషిగా, పిఠాపురం ప్రజల ఆడపడుచుగా అందరికీ సేవ చేసుకునే భాగ్యం కల్పించాలని కోరారు. అడుగడుగునా మహిళలు సాదర స్వాగతం పలుకుతుంటే, ఆమె వారిని ఆప్యాయంగా పలకరించి అక్కున చేర్చుకున్నారు. తమకు ఏ సమస్య వచ్చినా నిర్భయంగా చెప్పుకొనే అవకాశం తోటి మహిళగా ఆమె వద్దే ఉందని, అందుకే ఆమె కావాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ స్థానికులు ముక్తకంఠంతో చెప్పారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లిన ఆమె ఇప్పటి వరకూ తాను పిఠాపురం పట్టణంలో చేసిన అభివృద్ధిని వివరించారు. ఆమె వెంట పార్టీ నాయకుడు అడపా రఘు, సర్పంచ్ బోయి నాగేశ్వరరావు, ఎంపీటీసీ జవ్వాది వాడపల్లి, ధర వెంకటరావు, గట్టి వీరమోహన్‌రావు, బోయి కృష్ణ, ధర నాగేశ్వరరావు, పలువురు నేతలు ఉన్నారు.



ఎన్నికల ప్రచారంలో వృద్ధురాలిని పలకరిస్తున్న వంగా గీత

తనిఖీల్లో నిబంధనలు పాటించాలి

- 500 గ్రాములు దాటిన బంగారం సీజ్ చేయండి
- రూ.10 వేల విలువ దాటిన మద్యాన్నీ.. నగదు రూ.50 వేలు మించితే స్వాధీనం చేసుకోండి
- అధికారులకు ఈఆర్ఓ జేఎస్ రామారావు ఆదేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఓ, ఆర్డీఓ జేఎస్ రామారావు

పెద్దాపురం: ఎన్నికల నిబంధనలకు లోబడే ఫ్లయింగ్ స్క్వాడ్ (ఎఫ్ఎస్‌టి) బృందం తనిఖీలు నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జేఎస్ రామారావు ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఎఫ్ఎస్‌టీ బృందంతో ఇప్పటి వరకు జరిగిన తనిఖీల పనితీరు, జరగనున్న తనిఖీలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రామారావు మాట్లాడుతూ ఎన్నికల నియమావళికి సంబంధించి ఓటర్లను ప్రలోభపెట్టే వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించి ఎమ్మెల్యే అభ్యర్థులకు సంబంధించిన వారు ఎవరైనా రూ.50 వేలకు మించి నగదు, రూ.పది వేల విలువకు మించి ఉన్న మద్యాన్ని తరలిస్తూ పట్టుబడితే స్వాధీనం చేసుకుని చర్యలు తీసుకోవాలన్నారు. తనిఖీలు నిర్వహించేటప్పుడు ఒక్క మహిళకు సంబంధించి 500 గ్రాముల లోపు బంగారు, వెండి వస్తువులు ఉండవచ్చని, వాటికి మించి బంగారు ఆభరణాలు తరలించినట్లైతే సీజ్ చెయ్యాలన్నారు. అలాగే అవివాహిత అయితే 250 గ్రాములు, మహిళ, పురుషులకు సంబంధించి 100 గ్రాముల బంగారు ఆభరణాల వేసుకోవడం గాని, తరలించేందుకు గాని ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. అంతకు మించి ఆభరణాలు వేసుకున్నా, తరలిస్తున్నా ఎన్నికల నిబంధనల మేరకు వాటిని తనిఖీ చేసి సీజ్ చెయ్యవచ్చని ఆర్ఓ సూచించారు. తనిఖీల్లో ఎక్కడైనా రూ.10 లక్షలకు మించి నగదు, వస్తువులు సీజ్ చేసేటప్పుడు ఐటీ అధికారులకు సమాచారం అందించి వారిచేత ఎఫ్ఐఆర్ నమోదు చేయించి పంచనామా నివేదికలను సమర్పించాలని ఆయన అధికారులకు సూచించారు. తనిఖీలను మరింత ముమ్మరం చేయాలన్నారు. అనంతరం పలు అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సమావేశంలో సామర్లకోట మున్సిపల్ కమిషనర్ రామారావు, ఎఫ్ఎస్‌టీ అధికారులు సంజయ్‌కుమార్, యినుమర్తి సురేష్, శర్మ, చౌదరి, ఎఫ్ఎస్‌టీ బృందం పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవల్లో పాల్గొంటాం

పలు వార్డుల వలంటీర్ల రాజీనామాలు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ అధికారంలోనికి వచ్చిన తరువాత స్వచ్ఛంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి వలంటీర్లుగా చేరామని, అయితే ప్రతిపక్షాల కుట్రలతో విధులకు దూరం కావలసి వస్తోందని వలంటీర్లు మిరియాల సాగర్, దూలపల్లి రాజు, సూరంశెట్టి ప్రియాంక, జీఎస్వీ రోహిణి, మలిపిరెడ్డి వెంకటలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తమ పదవులకు రాజీనామాలు చేసి తమ తమ వార్డుల్లో ప్రజలకు సేవలు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. పేదలకు సేవలు చేయడానికి తమను దూరం చేసిన వారికి బుద్ధి చెప్పేలా స్వయంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్ని ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబుల విజయానికి కృషి చేస్తామని చెప్పారు. వేట్లపాలెంలోని నాలుగు సచివాలయాలకు చెందిన వలంటీర్లతో పాటు 15, 29వ వార్డుల వలంటీర్లు తమ రాజీనామాలను సచివాలయ అడ్మిన్‌లకు అందజేశారు.

మాధవపట్నంలో 43 మంది..

సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా మండల పరిధిలోని మాధవపట్నం గ్రామానికి చెందిన 43 మంది వలంటీర్లు తమ పదవులకు రాజీనామాలు చేశారు. ఈ మేరకు వారి రాజీనామాలకు పంచాయతీ కార్యదర్శి వై.శ్రీహరికి మంగళవారం అందజేసి స్వచ్ఛంద సేవల్లో పాల్గొంటామని వారు ప్రకటించారు.



రాజీనామా పత్రాలు ఇస్తున్న సామర్లకోట 29వ వార్డుకు చెందిన వలంటీర్లు

ఇప్పటి వరకు 52 మంది..

కొత్తపల్లి: మండలంలో ఇప్పటి వరకూ 52 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్టు ఎంపీడీఓ వెంకట నారాయణ మంగళవారం తెలిపారు. నాగులాపల్లి సచివాలయం–1లో 16 మంది, సచివాలయం–2లో 16, ఉప్పాడ సచివాలయం–1లో ఇద్దరు, సచివాలయం–2లో నలుగురు, సచివాలయం–3లో 12, సచివాలయం–4లో ఇద్దరు వలంటీర్లు రాజీనామా చేశారని చెప్పారు. రాజీనామా పత్రాలను ఆయా పంచాయతీల కార్యదర్శులకు అందించగా, వాటిని ఉన్నతాధికారులకు పంపించామన్నారు.

మూకుమ్మడి రాజీనామా

కొత్తపల్లి: నాగులాపల్లి గ్రామానికి చెందిన రెండు గ్రామ సచివాలయాల వలంటీర్లు మంగళవారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. గ్రామ సచివాలయం–1, 2ల్లో 16 మంది వంతున మొత్తం 32 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఇంటింటికీ వెళ్లి సేవలు అందించామన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అవ్వాతాతలు, దివ్యాంగులకు పింఛన్లు అందించామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా మళ్లీ గెలిపించుకునేందుకు కృషి చేస్తామన్నారు.

చెందుర్తి గ్రామంలో..

గొల్లప్రోలు: వలంటీర్లపై ప్రతిపక్ష నేతలు ఈసీకి ఫిర్యాదు చేయడానికి నిరసనగా వారు మూకుమ్మడి రాజీనామా చేశారు. మండలంలోని చెందుర్తి గ్రామంలో మంగళవారం 29 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేసి, రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి కె.దత్తుకు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజాసేవే లక్ష్యంగా పనిచేసే వలంటీర్లను సంఘవిద్రోహ శక్తులుగా చిత్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతో ఐదేళ్ల పాటు ప్రజలకు నిస్వార్థంగా సేవలందించామన్నారు. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో తమను విధులకు దూరంగా ఉంచడాన్ని ఖండిస్తూ రాజీనామా చేసినట్టు చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీలను మట్టి కరిపిస్తామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుని, ప్రజలకు సేవలందిస్తామన్నారు.

రాత్రివేళ రాములోరి పెళ్లి

- పూర్వం నుంచి చేబ్రోలులో ఇదే ఆచారం
- సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి



చేబ్రోలులోని సీతారాముల ఆలయం

గొల్లప్రోలు: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సీతారాముల దివ్య కల్యాణాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో సీతారాముల కల్యాణం బుధవారం రాత్రి 9 గంటలకు కన్నులపండువగా నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త దామెర వెంకటదివాకర్, ఈఓ జి.అశ్విని తెలిపారు. దేశంలోనే రాత్రిపూట కల్యాణం జరిగే ఏకైక దేవాలయమిది. పూర్వం పిఠాపురం మహారాజు భద్రాచలంలో మధ్యాహ్నం సీతారాముల కల్యాణం తిలకించి, తిరిగి అక్కడి నుంచి చేబ్రోలు వచ్చేసరికి రాత్రి సమయమయ్యేది. అప్పటి నుంచి రాత్రి వివాహం జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరిస్తారు. నవమి రోజు భారీ ఎత్తున అన్నసమారాధన జరుగుతుంది. వీటితో పాటు గజ వాహనం, ఆంజనేయుని వాహనం, పొన్న వాహనం, సర్ప వాహనంపై ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగిస్తారు. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు విద్యుద్దీపాలంకరణతో రథోత్సవం ఘనంగా నిర్వహించి, భారీ ఎత్తున బాణసంచా కాలుస్తారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే అతి పెద్ద రథం చేబ్రోలులోనే ఉంది. జిల్లాలోని దూర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. పెళ్లి కాని యువకులు ఇక్కడ రథం గొలుసు లాగితే పెళ్లవుతుందని నమ్మకం, గ్రామస్తులు, ధర్మకర్తల ఆర్థిక సహకారంతో ఉత్సవాలు జరుగుతాయి. పౌర్ణమి ముందు రోజు శ్రీపుష్ప యాగంతో ఉత్సవాలు ముగుస్తాయి.



చేబ్రోలులో ఉన్న సీతారాముల వారు

ముస్తాబవుతున్న ఆలయాలు

కొత్తపల్లి: మండలంలోని సీతారామ లక్ష్మణుల ఆలయాలు శ్రీరామనవమి ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి. మండలంలో సీతారాముల కల్యాణాన్ని ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్నారు. ఇప్పటికే కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొమరగిరి, గొర్స, మూలపేట, ఉప్పాడ, కొండెవరం, పొన్నాడల్లో ఉన్న ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించి, రంగులు, మామిడి తోరణాలతో సుందరంగా తీర్చిదిద్దారు.

అనాథ వృద్ధాశ్రమానికి వితరణ

కాకినాడ రూరల్: పెద్దాపురంలోని ఆదరణ అనాథ వృద్ధుల ఆశ్రమానికి భోజన నిమిత్తం కాకినాడ రూరల్ రాయుడుపాలెంలోని విలియమ్స్ చారిటబుల్ సొసైటీ మంగళవారం నగదుతో పాటు పండ్లు, వస్త్రాలను అందజేసింది. సంస్థ వ్యవస్థాపకుడు స్టీఫెన్ ఆనంద్, సీటీసీ వ్యవస్థాపకుడు యం.ఎస్. విలియమ్స్ ఈ మేరకు ఆశ్రమ నిర్వాహకుడు చందుకు సాయాన్ని అందజేశారు.



పెద్దాపురంలోని అనాథ వృద్ధుల ఆశ్రమానికి భోజనం నిమిత్తం సహకారం అందిస్తున్న విలియమ్స్